క్లుప్తంగా

డైట్ రోడ్డును మరమ్మతు చేయండి

కార్వేటినగరం: కొన్ని వందల మందికి ఉత్తమ భవిష్యత్తును అందించి డైట్‌కు వెళ్లే రోడ్డు గుంతల మయంగా మారింది. నడిచేదానికి సైతం నరక ప్రాయంగా మారిందని ఛాత్రోపాధ్యాయులు చెబుతున్నారు. కార్వేటినగరానికి రెండు కిలోమీటరు దూరంలో 45 సంవత్సరాల క్రితం 20 ఎకరాల విస్తీర్ణంలో టీటీసీ కళాశాలను నిర్మించారు. ఉపాధ్యాయులకు నిలయంగా ఉన్న డైట్ కళాశాలకు వెళ్లే మార్గం దుస్థితికి చేరుకుంది. శిక్షణ పొందే ఛాత్రోపాధ్యాయులకు కాలినడక తప్ప వేరే మార్గం లేదు. దీంతో గుంతలమయంగా మారిన రోడ్డుపై విద్యార్థులు నడవ లేక ఇబ్బందులు పడుతున్నారు. అదే మార్గంలో రెండు గ్రామాలు ఉన్నాయని, అలాగే వ్యవసాయ భూములకు సైతం వెళ్లాల్సి ఉంది. దుస్థితికి చేరుకున్న రోడ్డుపై అడుగు పెట్ట లేక పోతున్నామని స్థానిక రైతులు సైతం చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డైట్ రోడ్డు మార్గాన్ని మరమ్మతు చేయాల్సి ఉంది.

మహిళలకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న దాతలు

నగరి: ఓంశక్తి ఆలయంలో కంటి చూపు లేని మహిళలకు రాష్ట్ర ఎన్జీఓ సంఘ నాయకులు, రిటైర్డ్ పంచాయతీ ఈఓ కోలా రామచంద్రన్ ఆదివారం చీరలు పంపిణీ చేశారు. ముందుగా కుటుంబ సమేతంగా ఓం శక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం చీరలు పంపిణీ చేశారు.

డిప్యూటీ సీఎం పరామర్శ



విజయమ్మను పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండలం వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ మధురెడ్డి తల్లి విజయమ్మను మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పరామర్శించారు. అనారోగ్య కారణంగా వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతున్న విజయమ్మను పరామర్శించి, ఆరోగ్య వివరాలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులను కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ పెనుమూరు మండల నాయకులు పాల్గొన్నారు.

చిరుద్యోగులపై సభ్యత్వ భారం

పాలసముద్రం: మండలంలో టీడీపీ నాయకులు చిరుద్యోగులైన ఉపాధిహామీ ఫీల్డ్‌అసిస్టెంట్లు, వెలుగు సంఘమిత్రలతో టీడీపీ సభ్యత్వ నమోదు కోసం టార్గెట్‌లు పెడుతున్నారు. ప్రత్యేకంగా వాట్సాప్ ద్వారా సభ్యత్వ నమోదు చేయిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, సంఘమిత్రలు గ్రామాల్లోకి వెళ్లి.. తెలుగుదేశం సభ్యత్వం కార్డు చేసుకుంటేనే సంక్షేమ పథకాలు, ఉపాధిహామీ పనులు, డ్వాక్రా గ్రూపుల్లో రుణాలకు అర్హులని, లైఫ్ ఇన్సూరెన్స్ వస్తుందని ఒత్తిడి చేసి ప్రజలతో బలవంతంగా సభ్యత్వం చేస్తున్నారు. మండలంలో కొంతమంది బడా నాయకులు సంఘమిత్రలకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఫోన్ పే ద్వారా కొంత డబ్బులు పంపించి సభ్యత్వ నమోదు పూర్తి చేయాలని టార్గెట్‌లు ఇస్తున్నట్లు సమాచారం.

మోటార్ సైకిళ్లు ఢీ : ఇద్దరికి గాయాలు

ఐరాల: మితిమీరిన వేగంతో వెళ్తూ మోటార్ సైకిళ్లు ఢీకొనడంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని ఎం.పైపల్లె వద్ద ఆదివారం చోటుచేసుకుంది. కాణిపాకం ఎస్ఐ ధరణీధర కథనం మేరకు.. ముదిగోళంకు చెందిన రాము జనరేటర్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రాము బైక్‌లో ఉదయం తిరుపతి నుంచి ఐరాలకు వెళ్తుండగా, అదే సమయంలో పృథ్వీరాజ్ బైక్‌లో వైఎస్.గేటు నుంచి ముదిగోళంకు బయలుదేరాడు. ఎం.పైపల్లె వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108లో జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరసిద్ధుని సేవలో బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ



స్వామి ప్రసాదం అందుకుంటున్న ప్రిన్సిపల్ సెక్రటరీ పోలా భాస్కర్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం రాష్ట్ర బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ పోలా భాస్కర్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనం పలికి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

సమ్మెకు సిద్ధం





108 వాహనంలో పురుడు పోస్తున్న 108 సిబ్బంది(ఫైల్)





అధికారులకు సమ్మె నోటీసులు అందిస్తున్న 108 సిబ్బంది, నిరాహార దీక్ష చేస్తున్న 108 సిబ్బంది నాయకులు, (ఇన్‌సెట్) నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న 108 సిబ్బంది

- డిమాండ్‌ల సాధనకు 108 సిబ్బంది పోరు
- 25వ తేదీపైన మోగనున్న సమ్మె సైరన్

గంగాధరనెల్లూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన 108 వాహనం నిలిచిపోతుందేమోనని ఆందోళనలు నెలకొంటున్నాయి. ఆపద సమయాల్లో ఆదుకునే 108 సిబ్బందికి కష్టం వచ్చింది. క్షణాల్లో వాహనాలను తీసుకొచ్చే సిబ్బంది, ఈఎంటీ పైలట్లు తమ డిమాండ్లను పరిష్కరించాలని ఇప్పటికే రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అధికారులకు వినతులు సమర్పించారు. తమ న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఈ నెల 25వ తేదీ నుంచి సమ్మె బాట పడతామని చెబుతున్నారు.

108 సిబ్బంది ప్రధాన డిమాండ్లు

- 12 గంటల పని విధానం రద్దు చేసి 8 గంటల పని విధానం అమలు చేయాలి.
- 108 నిర్వహణ ప్రైవేట్ సంస్థ చేతికి ఇవ్వకుండా ప్రభుత్వమే నిర్వహించాలి.
- తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలలో వెయిటేజ్ ఇవ్వాలి.
- వేతన స్లాబ్‌ని అప్‌డేట్ చేసి, వేతనాలు పెంచాలి.
- అంతర్ జిల్లాల బదిలీలు, చనిపోయిన సిబ్బందికి రూ.20 లక్షల ప్రమాద బీమా కల్పించాలి.
- ఉద్యోగుల పీఎఫ్ నిధులు వేతనాల నుండి తీసుకుంటున్నారు. అలా కాకుండా యాజమాన్యం వాటా నుండి వసూలు చేయాలి.
- వేతనాలు సరైన సమయానికి ఇవ్వాలి.
- రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలి.
- వైద్య ఆరోగ్య శాఖకి అనుసంధానంగా చేర్చాలి. ఆ శాఖ ఉద్యోగుల్లా జీతభత్యాలు ఇవ్వాలి. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే రాష్ట్ర కార్యవర్గ నాయకుల ఆదేశాల మేరకు సమ్మె చేస్తామని 108 సిబ్బంది అంటున్నారు.

సేవలు నిలిచిపోతే ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం 108 వాహన సేవల కారణంగా కొన్ని మారుమూల పల్లెల్లో కూడా గ్రామీణులు ధైర్యంగా ఉన్నారు. అందుకే 108 వాహనాల సిబ్బంది సమ్మెపై ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నియోజకవర్గంలో మొత్తం ఆరు 108 వాహనాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఒక రోజుకు ఒక వాహనం ద్వారా 5 నుండి ఆరుగురికి సేవలు అందిస్తున్నారు. ఒక వాహనం ద్వారా నెలకు సుమారు 150 నుండి 108 మందికి లబ్ధి చేకూరుతుంది. ఇందులో 15 మంది పైలట్లు, 15 మంది ఈఎంటీలు సేవలందిస్తున్నారు. 108 సిబ్బంది సమస్యల పరిష్కరించకపోతే ఈ సేవలన్నీ స్తంభించిపోతాయేమో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి



108 వాహనాల నిర్వహణ బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలి. ప్రైవేటు సంస్థల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. 108 వాహనాల నిర్వహణకు ప్రభుత్వం కోటి రూపాయలు కేటాయిస్తుంది. ఈ నిధులను ప్రభుత్వమే వినియోగించాలి. 108 సిబ్బంది సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలి. లేదంటే పోరాటం ఉధృతం చేస్తాం.

– సందీప్, ఈఎంటీ, 108 సిబ్బంది

అలుపెరగని సేవలు అందిస్తున్నాం



రోగులను అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి తరలించి ఎంతోమంది ప్రాణాలు కాపాడుతున్నాం. రేయింబవళ్లు తేడా లేకుండా కష్టపడుతున్నాం. ప్రాణాలను పణంగా పెట్టి ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి అతివేగంగా ప్రయాణిస్తున్నాం. ప్రజాసేవలో తలమునకలైన 108 సిబ్బందిని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలి. వేతనాలు సరైన సమయానికి ఇవ్వాలి.

– కె.ప్రదీప్ కుమార్, 108 పైలెట్, గంగాధరనెల్లూరు

డీజిల్ లేదు.. రాలేం..



ప్రాథమిక ఆరోగ్యకేంద్ర ఆవరణలో నిలిచిన 108 వాహనం

- రెండు రోజులుగా నిలిచిన సేవలరు
- ప్రైవేటు వాహనాలే దిక్కు

పాలసముద్రం: మండలంలో గత రెండు రోజుల నుంచి 108 అంబులెన్స్ సేవలు నిలిచిపోయాయి. 24 గంటలు అందుబాటులో ఉంటూ ఆపదలో ఉన్న వారిని సకాలంలో ఆస్పత్రులకు చేర్చే 108 వాహనం డీజిల్ లేక నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం 108 సిబ్బందికి వేతనాలు ఇవ్వకపోగా, కనీసం వాహనానికి డీజిల్‌కు కూడా డబ్బులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోతున్నాయి. వివిధ గ్రామాల నుంచి వైద్యం కోసం ప్రజలు 108కు కాల్ చేయగా సిబ్బంది నుంచి వాహనం బ్రేక్‌డౌన్ అనే సమాధానం రావడంతో ప్రైవేట్ వాహనాల ద్వారా రోగులను ఆస్పత్రుల్లో చేర్పించాల్సి వచ్చింది. 108 వాహన సిబ్బందికి నాలుగు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోతున్నారు. నెల రోజులకు ముందే కిడ్నీ బాధితులను 108 వాహనాల్లో తీసుకెళ్లడం మానేశారు. డయాలసిస్ చేయించేకునే బాధితులు సొంత ఖర్చులు పెట్టుకుని వెళ్తున్నారు. సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుని 108 వాహన సేవలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

అయ్యప్పకు విశేష పూజలు



అన్నదాన కార్యక్రమం

నింద్ర: మండలంలోని కొప్పేడు గ్రామంలో ఆదివారం అయ్యప్పస్వామి పూజలు ఘనంగా సాగాయి. గ్రామంలోని అయ్యప్ప భక్తులు ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం అయ్యప్ప స్వామికి పూజలు చేపట్టారు. స్వామి చిత్రిపటాన్ని గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

గోసంరక్షణ ట్రస్టుకు విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన గోసంరక్షణ ట్రస్టుకు ఆదివారం రాజమండ్రికి చెందిన గోపాలకృష్ణ రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. స్వామి దర్శనానంతరం దాత కుటుంబ సభ్యులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, రవి తదితరులు పాల్గొన్నారు.

నరసింహారెడ్డి మృతికి నివాళి



నరసింహారెడ్డి (ఫైల్)

నగరి: గంగజాతర నిర్వాహకుడు, రిటైర్డ్ ఏఈఓ నరసింహారెడ్డి(90) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు కుమార్‌స్వామిరెడ్డి, పార్టీ నాయకులు ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. అలాగే పట్టణంలోని పార్టీ నాయకులు, పట్టణ ప్రజలు ఆయన మృత దేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రతి ఏటా గంగ జాతర నిర్వహణలో చురుగ్గా పాల్గొంటూ, భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయడంలో మంచి నైపుణ్యం కలిగిన వ్యక్తి అని కొనియాడారు.



నరసింహారెడ్డి మృత దేహానికి నివాళులర్పిస్తున్న కుమార్‌స్వామిరెడ్డి

విష రహిత ఆహారోత్పత్తులు అందించడమే లక్ష్యం

– డీపీఎం వాసు



జిల్లేడుపల్లెలో క్షేత్ర స్థాయి పర్యటనలో వ్యవసాయాధికారులు, ఏపీసీఎన్ఎఫ్ సభ్యులు

బంగారుపాళెం: ప్రకృతి వ్యవసాయంతో సమాజానికి విష రహిత ఆహారోత్పత్తులు అందించడమే ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్(ఏపీసీఎన్ఎఫ్) లక్ష్యమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు అన్నారు. జిల్లాలో ఏపీసీఎన్ఎఫ్‌లో పనిచేస్తున్న సిబ్బంది ఆదివారం మండలంలోని జిల్లేడుపల్లెలో మెంటర్ చంద్రకళ పొలంలో సాగు చేస్తున్న ఏ గ్రేడ్, డ్రాట్ ప్రూఫింగ్, డీఆర్ఎస్, సూర్యమండలం(న్యూట్రి గార్డెన్) ప్లాట్లను సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటల సాగుకు వినియోగించే ఎరువులు, కషాయాల తయారీని ప్రదర్శనపూర్వకంగా వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తే కలిగే ప్రయోజనాలు, లాభాలను తెలియజేశారు. వాసు మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్తున్న చిన్నకారు రైతులు, మహిళా సంఘాల ప్రేరణాశక్తికి నిదర్శనమన్నారు. ప్రకృతి వ్యవసాయంతో జీవనోపాధి మెరుగుపరచుకోవడమే కాకుండా ఆహారం, పోషక విలువల భద్రతకు ఏపీసీఎన్ఎఫ్ భరోసా కల్పిస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ప్రొత్సహించేందుకు నేచురల్ ఫార్మింగ్ సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ ట్రైనింగ్ టీం కో-ఆర్డినేటర్ మీరాబీ, నేచురల్ ఫార్మింగ్ అసిస్టెంట్లు, ట్రైనింగ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో బహుళ ప్రయోజనాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమౌళి

పుత్తూరు: నేషనల్ క్యాడెట్ కారప్స్(ఎన్‌సీసీ)లో శిక్షణ పొందిన విద్యార్థులు బహుళ ప్రయోజనాలు పొందేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి తెలిపారు. ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఏటా నవంబర్ నాలుగో ఆదివారం రోజున ఎన్‌సీసీ దినోత్సవాన్ని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందడం ద్వారా సామాజిక సేవ, జాతీయ భావం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. అలాగే శారీరక దృఢత్వం, ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఉంటాయని, తద్వారా లబ్ధి పొందవచ్చునన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, పోలీస్ శాఖల్లో అధిక ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. విద్యార్థులు ఎన్‌సీసీలో చేరి అందరికీ ఆదర్శంగా నిలవాలని సూచించారు. కళాశాల నుంచి ముగ్గురు క్యాడెట్లు ప్రి రిపబ్లిక్ క్యాంపులో శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ నుంచి కెప్టెన్ హోదా పొందిన ఎన్‌సీసీ అధికారి ఎం.శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. శిక్షణా శిబిరంలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు వాణిశ్రీ, దేవకి, గాయత్రి, తిరుమలయ్య, గంగయ్య, మురళీమోహన్‌రెడ్డి, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

వైద్యులు అప్రమత్తంగా మెలగాలి

- ఎమర్జెన్సీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ సిద్ధార్థరెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ సిద్ధార్థరెడ్డి

పుత్తూరు: రోగికి అందించే వైద్యసేవలపై డాక్టర్లు అప్రమత్తంగా మెలగాలని తిరుపతి మారుతి హాస్పిటల్స్ ఎమర్జెన్సీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ సిద్ధార్థ రెడ్డి సూచించారు. ఆదివారం పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ భవనంలో ఫౌండర్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన అత్యవసర వైద్యం-విధానం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. డాక్టర్ సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ గుండెనొప్పి, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, పాముకాటు, కరెంట్ షాక్ తదితర ప్రమాదకర పరిస్థితుల్లో వైద్యుల వద్దకు వచ్చే వారికి ముందుగా రోగ నిర్ధారణ చేసి, తక్షణ వైద్య సేవలందించి, అత్యవసర వైద్య సేవలు కలిగిన హస్పిటల్స్‌కు తరలించాలన్నారు. ఇది వైద్యుల ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. ప్రజలు సైతం ఆరోగ్యం, వైద్య చికిత్సలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మితాహారంతోపాటు, రోజుకు 4 లీటర్ల మంచినీటిని తాగాలని సూచించారు. అలాగే ప్రతి రోజూ విధిగా 45 నిమిషాల పాటు నడవడంతోపాటు. క్రమం తప్పని వ్యాయామం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని వివరించారు. 40 ఏళ్లు వచ్చిన ప్రతి ఒక్కరూ ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేసుకుని, తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. అనంతరం అసోసియేషన్ నాయకులు డాక్టర్ సిద్ధార్థ రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్ముగం, డాక్టర్ రవిరాజు, అసోసియేషన్ నాయకులు గుణశేఖర్‌రెడ్డి, మాధవులునాయుడు, కుప్పయ్యశెట్టి, మునికృష్ణయ్య, పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి కోదండరామాలయంలో ఉత్సవాలు

తవణంపల్లె: కార్తీక మాసం పురస్కరించుకుని మండలంలోని టి.పుత్తూరు కోదండరామాలయంలో సోమవారం నుంచి మూడురోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.సిద్ధేశ్వరరెడ్డి తెలిపారు. తొలిరోజు సోమవారం సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి, ధూపదీపనైవేద్యం సమర్పిస్తామన్నారు. ఉదయం 9.15 గంటలకు గో పూజ, ఉభయదారులతో ఉత్సవమూర్తులకు అభిషేకం, ఊరేగింపు, తులసి, ఉసిరి చెట్లకు కల్యాణోత్సవం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంకాలం పుష్పయాగ మహోత్సవానికి అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వివరించారు.

ఉపాధి తోటలు

కేంద్ర ప్రభుత్వం అమలు చేసే మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు అండగా నిలుస్తోంది. పూలతోటలు, కొబ్బరి, జామ, మామిడి పంటలు సాగు చేసే రైతులకు ఉపాధి హామీ పథకం కూలీల సమస్యను పరిష్కరించింది. దీంతో రైతులు మెలమెల్లగా ఉద్యాన పంటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానిస్తే పంట సాగుకు ఉన్న కూలీల సమస్య తీరుతుందని రైతులు కోరుతున్నారు.

– నింద్ర

- ఉపాధి పథకంలో ఉద్యాన పంటల సాగు
- వ్యవసాయంతో అనుసంధానం చేయాలంటున్న రైతులు





నింద్రలో మామిడితోట, కొప్పేడులో పూల తోట

మండలంలో 21 పంచాయతీలు ఉండగా అందులో 25 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో పంటల సాగుకు 42 చెరువులు ఉన్నాయి. 18 వేల హెక్టార్ల వ్యవసాయ భూములు ఉన్నాయి. వీటిపై ఆధారపడి 3 వేల మందికి పైగా రైతులు ఉన్నారు. అయితే కూలీల సమస్య, నీటి సమస్య కారణంగా ఆరు వేల ఎకరాలు మాత్రమే సాగులో ఉంది. మిగిలిన భూములు బీడుగా ఉన్నాయి. ఉపాధి హామీ పథకాన్ని ఉద్యాన పంటల్లో ప్రవేశపెట్టడంతో బీడుగా వదిలేసిన భూముల్లో మామిడి తోటలు, కొబ్బరి తోట, పూలతోటలు, జామతోటలు సాగు చేస్తున్నారు. పామోలిన్ సాగుకు కూడా కొందరు రైతులు సిద్ధమవుతున్నారు. 2740 మంది జాబ్ కార్డులు కలిగిన ఉపాధి కూలీలు చెరువుల పనులతోపాటు ఉద్యాన పంటల సాగులోనూ పనిచేస్తున్నారు. సాగుకు ప్రధానంగా ఎదురయ్యే కూలీల సమస్య ఉపాధి హామీ పథకం ద్వారా తీరుతోంది. మొక్కలు కూడా ఉపాధి పథకంలో సరఫరా చేసి ఏడాదిపాటు పర్యవేక్షణ కూడా చేపడుతున్నారు. దీంతో రూ.2 లక్షల వరకు రైతుకు లబ్ధి చేకూరుతోంది. దీంతో రైతులు ఉద్యాన పంటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ పథకాన్ని వ్యవసాయ పంటలకు కూడా అనుసంధానం చేస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. బీడుగా వదిలేసిన భూములు పచ్చదనం సంతరించుకుంటాయి.

ఎంఎస్‌వీయం పురంలో కొబ్బరి తోటలో జానకిరామరాజు



కొబ్బరితోట సాగు చేస్తున్నా..

నాకు రెండు ఎకరాల పొలం ఉంది. మిట్ట ప్రాంతం కావడంతో నీటి సమస్య, కూలీల సమస్య ఉండేది. దీంతో సాగు ఆపేశాను. ఉపాధి పథకంలో ఉద్యాన పంటల సాగు ఉండడంతో ప్రస్తుతం వారిని సంప్రదించారు. పొలాన్ని సరిచేసి కొబ్బరి మొక్కలు నాటించి ఇచ్చారు. ఏడాది వరకు పర్యవేక్షణ, కలుపు, ఎరువులు వారే అందిస్తుండడంతో రెండు ఎకరాల్లో ప్రస్తుతం కొబ్బరి తోట సాగులో ఉంది.

– జానకిరామరాజు, ఎంఎస్‌వీయంపురం

ఉపాధిలో రోజా సాగు



నాకున్న ఎకరం పొలాన్ని గతంలో వర్షాల సమయంలో మాత్రమే సాగు చేసేదాన్ని. కూలీల సమస్య కూడా ఎక్కువగా ఉండేది. పూలతోట సాగు చేద్దామనుకుంటే మొక్కలు కొనేందుకు డబ్బులు లేవు. ఉపాధి హామీ పథకంలో 2వేల రోజా మొక్కలు ఇచ్చారు. పొలంలో సాగు చేశాను. ప్రస్తుతం రోజా పూల దిగుబడి బాగుంది.

– కామాక్షమ్మ, వేదాంతపురం ఎస్టీకాలనీ

వ్యవసాయానికి అనుసంధానం



కూలీలు రాకపోవడంతో చాలామంది వ్యవసాయానికి స్వస్తి పలుకుతున్నారు. ఉద్యాన పంటలకు అనుసంధానం చేసిన ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి కూడా అనుసంధానం చేస్తే రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. వ్యవసాయం నిలిపేసిన వారు మళ్లీ సాగు ప్రారంభిస్తారు. ప్రజలకు పంటలు ఎక్కువగా అందుతాయి.

– వరదరాజు, రైతు, ఓబీఆర్ కండ్రిగ

అపరిశుభ్రంగా స్కంధ పుష్కరిణి



వ్యర్థాలతో నిండిన స్కంధ పుష్కరిణి

కార్వేటినగరం: ప్రసిద్ధి చెందిన స్కంధ పుష్కరిణి ప్రస్తుతం మురుగు నీళ్లగుంటను తలపిస్తోందని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. భక్తులు పవిత్రంగా భావించే స్కంధ పుష్కరిణిలో టీటీడీ అనుబంధంగా ఉంటున్న శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించిన పలు కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అదే విధంగా గోవింద మాలలు, అయ్యప్పస్వామి మాలలు ధరించిన భక్తులు పవిత్ర స్నానమాచరించే పుష్కరిణి వ్యర్థాలతో నిండి మురుగునీటి గుంటను తలిపిస్తోంది. టీటీడీ సిబ్బంది పట్టించుకోక పోవడంతో, పుష్కరిణి మెట్లు పిచ్చిమొక్కలతో నిండి విషపురుగులకు నిలయంగా మారుతోందని విమర్శలు వినిపిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్కంధ పుష్కరిణిలో ఉన్న వ్యర్థాలను తొలగించి పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని భక్తులు అంటున్నారు.